సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 7 । మే । 2025



అంతన్నారు.. ఇంతన్నారు

ప్రభుత్వ వైఖరిపై ఉద్యోగులు మండిపడుతున్నారు. మాటిచ్చి మరిచిపోయారని దుయ్యబడుతున్నారు.

- 8లో



ఇంకెన్నాళ్లు

తిలారు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతూనే ఉంది. మూడేళ్లుగా నిర్మాణం జరుగుతోంది.

- 8లో

240 లీటర్ల సారా సీజ్

మందస: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మందస మండలం మేఘమాల గ్రామంలో శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. 240 లీటర్ల సారాను సీజ్ చేసి ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సారా తయారీకి సంబంధించి కాలిగాం గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సోంపేట ఎక్సైజ్ సీఐ కె.బేబి తెలిపారు.

న్యూస్‌రీల్

ఉపాధి ఏపీఓపై కలెక్టర్ ఆగ్రహం

సంతబొమ్మాళి: విధుల్లో అలసత్వం వహిస్తున్న మండల ఉపాధి హామీ ఏపీఓ వంగ నర్సింహమూర్తిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లాలో ఫారంపాండ్స్ నిర్మాణాలపై కలెక్టర్ సిబ్బందితో గూగుల్ మీట్ నిర్వహించారు. మండలంలోని పొలాల్లో నీటి నిల్వలు ఉంచేందుకు 420 ఫారంపాండ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు కేవలం మండలంలో 16 ఫారం పాండ్‌ల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. దీంతో కలెక్టర్ ఏపీఓ నర్సింహమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చు కోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై డ్వామా పీడీ సుధాకర్ వివరణ కోరగా వారి ఫారం పాండ్స్ నిర్మాణాల్లో చాలా వెనుకబడి ఉన్నారని పనితీరు మార్చుకోవాలని కలెక్టర్ ఏపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత




పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ ఎస్‌ఐ రామారావు, సీఎస్‌డీటీ భీమారావు సిబ్బంది

కొత్తూరు: కొత్తూరు మండలం వసప గ్రామం వద్ద విజిలెన్స్ ఎస్‌ఐ జి. రామారావు సీఎస్‌డీటీ భీమారావులతో పాటు సిబ్బందితో మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో పికప్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 28.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం దొరికింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం నుంచి ముత్యాలు గ్రామానికి చెందిన సవర రామారావు పికప్ వ్యాన్‌తో 28.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను అక్రమంగా తరలిస్తుండగా వసప వద్ద విజిలెన్స్ సిబ్బంది పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యం సరుబుజ్జిలి మండలం కూనజమ్మన్నపేట గ్రామానికి చెందిన గండెం రవికుమార్‌విగా గుర్తించారు. పికప్ వ్యాన్ డ్రైవర్ రామారావు, బియ్యం యజమాని రవికుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ భీమారావు తెలిపారు.

9న మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మే 9 (శుక్రవారం)న ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నారని తెలిపారు. ఈ మేళాలో దాదాపు 12 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని 615 ఖాళీలను భర్తీ చేస్తాయని కలెక్టర్ తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగులు అర్హులని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమె, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో కలిసి ఉదయం 9 గంటలకు మేళా ప్రాంగణానికి రావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 99499 00672, 94932 90012 నంబర్లను సంప్రదించవచ్చని చెప్పారు.

'సమ్మెలో పాల్గొంటాం'



డిపో మేనేజర్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ, హమాలీ యూనియన్ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించే జాతీయ స్థాయి సమ్మెలో పాల్గొంటామని ఏపీబీసీ ఎల్, ఐఎంఎఫ్‌ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ ప్రకటించింది. ఈ మేరకు ఎచ్చెర్లలోని ఏపీ బేవరేజెస్ డిపో మేనేజర్ కణితి జయసింహ చౌదరికి సమ్మె నోటీస్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, హమాలీలకు దిగుమతి వేతనం రేట్లు పెంచాలని, కూటమి ప్రభుత్వం హామీ మేరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ రంగం పరిరక్షించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రతా చట్టం 2008 మేరకు బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయాలని, బేవరేజెస్ హమాలీలకు గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ యూనియన్ నాయకులు బంగార్రాజు, రామారావు, రాము, రమణ, శ్రీను పాల్గొన్నారు.



అదిగదిగో అలనాటి ▸ జీవన స్వర్గం!

అనగనగా ఓ కాలంలో.. సెల్ కోడి కూయకుండానే నిద్ర లేచేవారు. కరెంటు, రెంటు, ఎక్స్‌ట్రా.. వంటి కష్టాలు లేకుండా ప్రకృతితో మమేకమయ్యేవారు. ఉదయాస్తమయాల మధ్య కాలాన్ని అత్యంత సహజంగా గడిపేవారు. పున్నమి వెలుగు, అమావాస్య చీకటి, వాసంతపు వేకువ, శరత్ కాలపు రాత్రుళ్ల కాలాన్ని ఆస్వాదించేవారు. ఆధునికత వచ్చింది. యంత్రాలను తెచ్చింది. బతుకుల్లో సహజత్వం మాయమైపోయింది. కూర్మ గ్రామం మళ్లీ ఆ సహజత్వానికి దగ్గరగా బతుకుతోంది. వందల ఏళ్ల కిందటి జీవన విధానాన్ని అనుసరిస్తోంది. ఆ బతుకుల్లో తీపిని రుచి చూపేందుకు వేసవిలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

కూర్మగ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై యువతకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



- కూర్మ గ్రామంలో శ్రమైక జీవన సౌందర్యం
- యువతకు వేసవి శిక్షణ శిబిరాలు
- ప్రకృతి ప్రసాదం, సనాతన ధర్మ విస్తరణ లక్ష్యం

హిరమండలం:

కరెంటు లేని నివాసాలు.. రసాయనాలు లేని పంటలు, ఆధునికత అంటని బతుకులు.. వెరసి కూర్మ గ్రామం. హిరమండలం పరిధిలోని అంతకాపల్లి అడవుల్లో కనిపిస్తుందీ గ్రామం. కృష్ణ చైతన్య సమాజం పేరుతో 2018లో గ్రామం ఏర్పాటైంది. భక్తి వేదాంతస్వామి ప్రభుపాదుల ఆదేశాల మేరకు భక్తి వికాస్‌స్వామి ఆధ్వర్యంలో ఈ పల్లె ఏర్పడింది. ఏడాది పొడవునా ఇక్కడకు వేలాది మంది భక్తులకు తరలివస్తుంటారు. కాగా ప్రస్తుతం కూర్మ గ్రామంలో యువతకు నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

అన్నీ సొంతంగానే..

కూర్మ గ్రామంలో 80 మంది వరకూ నివాసముంటున్నారు. 20 వరకూ గృహస్తు జీవన కుటుంబాలు ఉన్నాయి. ఓ 20 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ఆరుగురు బ్రహ్మచర్యం పాటిస్తున్నారు. సరళ జీవనం, ఉన్నత చింతన వీరి విధానం. మనిషికి నిత్యావసరాలుగా భావించే కూడు, గూడు, గుడ్డ ప్రకృతి నుంచే పొందవచ్చని నిరూపిస్తున్నారు. ప్రకృతి సేద్యంతోనే వీటిని సంపాదించుకుంటున్నారు. ఏడాదిలో వీరికి అవసరమైన వందలాది బస్తాల ధాన్యాన్ని పండిస్తుంటారు. టన్నుల కొద్దీ కూరగాయలను సాగు చేస్తున్నారు. అక్కడ గృహస్తులతో పాటు విద్యార్థులు, ఏడాది పొడవునా ఇక్కడకు వచ్చే భక్తులకు వాటితోనే ఆహారం తయారుచేసి అందిస్తుంటారు. దంపుడు బియ్యాన్ని మాత్రమే వండుకుంటారు. వారి దుస్తులను వారే తయారుచేసుకుంటారు. ఇళ్లకు వారే మేస్త్రీలు, కూలీలు. ఇసుక, సున్నం, బెల్లం, మెంతులు, కరక్కాయలు, మినుములు మిశ్రమంగా చేసి గానుగ ఆడిస్తారు. గుగ్గిలం మరగబెట్టిన మిశ్రమంతో కలిపి ఇళ్లు కట్టుకున్నారు. కుంకుడు కాయ రసంతోనే దుస్తులను ఉతుక్కుంటారు.



వైదిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు,యువత



కొండల మధ్య కూర్మ గ్రామం

ఏటా యువతకు శిక్షణ

ప్రకృతి సమాజాన్ని విస్తరించాలని.. సనాతన ధర్మం వైపు ఈ సమాజం అడుగులు వేయాలని ఏటా యువతకు ఇక్కడ వేసవి శిబిరాలు ఏర్పాటుచేస్తున్నారు. నెలరోజుల పాటు చేతివృత్తులు, పురాతన జీవన విధానం, సనాతన ధర్మం వంటి వాటిపై అవగాహన కల్పిస్తారు. అందులో భాగంగానే ఈ నెల 1 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. వర్ణాశ్రమ కళాశాలలో ఈ శిబిరాలు నెల రోజుల పాటు కొనసాగుతాయి. చేనేత మగ్గం, మట్టికుండల తయారీ, వడ్రంగి, కర్రసాము, నూనెగానుగ, సున్నం గానుగ, వైదిక గృహ నిర్మాణం, ప్రకృతి వ్యవసాయం, గో సంరక్షణ, ఆయుర్వేదం వంటి వాటిపై ఇక్కడ శిక్షణ ఇస్తారు. మరోవైపు ఆధ్యాత్మిక కార్యక్రమాల శిక్షణ కూడా ఉంటుంది. మంత్రధ్యానం, శ్రవణం, కీర్తనం, వైదిక జీవన ప్రాముఖ్యత, రసాయనాలు లేని ఆహారం, మనస్సుకు, శరీరానికి అనుకూలమైన జీవన విధానం, గృహస్థ జీవన శిక్షణ, బ్రహ్మచారి శిక్షణ, సంస్కృత సంభాషణ అభ్యాసనం, శాస్త్ర అధ్యయనం, ఆధ్యాత్మిక సాధన అభ్యసనం, స్మార్ట్ ఫోన్, విద్యుత్, అధునాతన పరికరాలు లేకుండా జీవనం, మృదంగం, కరతాళ వాదనం శిక్షణ వంటి అంశాలపై నెలరోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుంది.

వర్ణాశ్రమ విద్య..

ఇక్కడ విద్యార్థులు వర్ణాశ్రమ విద్యను అభ్యసిస్తుంటారు. పూర్వపు గురుకులాలతరహాలో ఇక్కడ వాతావరణం ఉంటుంది. విద్యార్థులు సంస్కృతం, ఇంగ్లిష్, హిందీ, తెలుగులో అనర్గళంగా మాట్లాడతారు. వయసు, ఆసక్తిని బట్టి చేతివృత్తులపై శిక్షణ ఇస్తారు.

జీవిత లక్ష్యంపై అవగాహన



మనిషి జీవిత లక్ష్యంపై అవగాహన కల్పించడమే కృష్ణచైతన్యం. వర్ణాశ్రమ కళాశాలలో బతుకు తెరువు, వృత్తి కళలపై శిక్షణ ఇస్తున్నాం. నెల రోజుల పాటు వేసవి శిబిరాలు కొనసాగుతాయి. గుజరాత్, పంజాబ్, కర్ణాటక, తమిళనాడులో కూర్మ లాంటి గ్రామా లను నెలకొల్పాం. హంగేరిలో అయితే 800 ఎక రాల విస్తీర్ణంలో గ్రామం విస్తరిస్తోంది. చెక్ రిపబ్లిక్‌లోనూ ఒక పల్లె ఉంది. – నటేకర్ నరోత్తమదాస్, వర్ణాశ్రమ బోధకుడు, కూర్మ గ్రామం



సామూహికంగా అన్నప్రసాదం స్వీకరిస్తున్న దృశ్యం

మనిషిని సనాతన మార్గం వైపు నడిపించాలన్నదే కృష్ణచైతన్య సమాజం కూర్మ గ్రామం ఏకైక లక్ష్యం. అందుకే ఒక ఇంటితో ప్రారంభమైన ఈ శ్రీకారం ఇప్పుడు దాదాపు 80 ఇళ్ల వరకూ చేరుకుంది.

అక్రమాల గానం.. ▸ అధికారులు మౌనం

- అక్రమ గ్రావెల్ జోలికి వెళ్లని యంత్రాంగం
- ఎమ్మెల్యే వ్యవహారం కావడంతో చేతులెత్తేసిన అధికారులు
- సంచాం కొండ విధ్వంస కారకులపై చర్యలు శూన్యం
- తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న మైనింగ్ శాఖ
- బస్ షెల్టర్ కూల్చివేతపైనా మౌనం వహిస్తున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రణస్థలం మండలం సంచాం, అర్జునవలసలోని కొండలను తవ్వింది ఎవరు..? తవ్విన గ్రావెల్‌ను తరలించింది ఎవరు..? ఎమ్మెల్యే ఇళ్లు, స్కూల్ వద్ద గ్రావెల్ వేసి చదును చేసింది ఎవరు..? గ్రావెల్ విధ్వంసంలో ఇలాంటి ప్రశ్నలెన్నో ఉదయిస్తున్నా.. సమాచారం సేకరించి సమాధానం చెప్పే ఉత్సుకత సంబంధిత అధికారుల్లో కనిపించడం లేదు. ఇక్కడ అక్రమాలకు పాల్పడింది ఎవరో అందరికీ తెలుసు. కానీ వారిపై చర్యలు తీసుకోవడానికి యంత్రాంగానికి ధైర్యం చాలడం లేదు.

రణస్థలం మండలం సంచాం, అర్జునవలస పరిధిలోని కొండను ముందు వెనక తవ్వారు. తవ్విన గ్రావెల్‌ను టిప్పర్లతో రవాణా చేసి ఎమ్మెల్యే ఎస్.ఈశ్వరరావు ఇంటికి, స్కూల్‌కి మధ్య ఉన్న ఆవరణలో వేసి చదును చేశారు. ఇంత జరిగినా చట్టం వారికి చుట్టమైపోయింది. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడానికి అధికార యంత్రాంగం వెనుకంజ వేస్తోంది.

సంచాం రెవెన్యూ పరిధిలోని 84, 89-6 సర్వే నంబర్లలోనూ, అర్జునవలస సర్వే నంబర్ 139లోని కొండ ముందు, వెనక అడ్డగోలుగా ఐదు రోజుల పాటు తవ్వేశారు. తవ్వకాలకు అనుమతుల్లేవని సాక్షాత్తు తహసీల్దార్ స్పష్టం చేశారు. కానీ అక్రమంగా తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకోవడం లేదు. దీనికంతటికీ ఎమ్మెల్యే పాత్ర ఉండటమే కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి కోసమో, పొలం కోసమో తరలిస్తే కేసులు నమోదు చేసే అధికారులు వందలాది టిప్పర్లతో తరలించి ఎమ్మెల్యే ఇళ్లు, స్కూల్ వద్ద చదును చేసేందుకు వేసినా మౌనం వహిస్తున్నారు.



గ్రావెల్ తరలించుకుపోయిన సంచాం కొండ

రాత్రింబవళ్లు తవ్వకాలు, తరలింపు

సీఎం చంద్రబాబు పర్యటన రోజున సంచాం కొండ నుంచి గ్రావెల్ తవ్వకాలకు స్కెచ్ చేశారు. సీఎం సభాస్థలి ఏర్పాట్లలో భాగస్వామ్యమైన విశ్వ సముద్ర సంస్థ ప్రతినిధులతో అక్కడే మంతనాలు జరిపారు. ఇంకేముంది పథకం ప్రకారం సీఎం పర్యటన ముగియగానే కార్యాచరణ అమలు చేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు జరిపారు. ఆ రోజు మంతనాలు జరిపిన విశ్వసముద్ర సంస్థకు చెందిన టిప్పర్లతో తవ్విన గ్రావెల్‌ను తరలించారు. వందలాది లోడ్‌లను ఎమ్మెల్యే ఇంటి దగ్గర డంప్ చేశారు. తవ్వకాలు జరిగిన చోట, డంప్ చేసిన చోట స్థానికులు ప్రశ్నిస్తే ఎమ్మెల్యేకు సంబంధించినదని, విశ్వ సముద్ర వాహనాలని సాక్షాత్తు సదరు సంస్థ సిబ్బంది చెప్పడం గమనార్హం.

మైనింగ్ అధికారులెక్కడ..?

రాత్రి, పగలు తేడా లేకుండా సంచాం కొండలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నా.. పత్రికల్లో వార్తలొచ్చినా మైనింగ్ అధికారులు స్పందించకపోవడం ఆశ్చర్యం కల్గిస్తోంది. ఇంత జరుగుతున్నా వారిలో చలనం లేదు. ఇదే సంచాం కొండలో గతంలో కొంతమంది అక్రమ తవ్వకాలు జరిగినప్పుడు మైనింగ్ అధికారులు వెళ్లి హడావుడి చేసిన దాఖలాలు ఉన్నాయి. కానీ, పెద్ద మొత్తంలో కొండ ముందు, వెనక భాగంలో తవ్వేసి తరలిస్తుంటే కనీసం పట్టించుకోలేదు. ఎమ్మెల్యేకు సంబంధించిన వ్యవహారమని వదిలేశారో లేదంటే ఒత్తిళ్లు వచ్చాయో తెలియదు గానీ గ్రావెల్ తవ్వకాలు జరిపిన కొండ వద్దకు గాని, గ్రావెల్ డంప్ చేసిన ప్రాంతానికి వెళ్లిన పాపానికి పోలేదు.

కళ్ల ముందు కనిపిస్తున్నా..

కళ్ల ముందు సంచాం కొండపై అక్రమ తవ్వకాలు కనిపించాయి. తవ్విన గ్రావెల్‌ను ఎమ్మెల్యే ఇళ్లు, స్కూల్ ఆవరణలో వేయడం కనిపించింది. పొక్లెయినర్ పెట్టి గ్రావెల్‌తో ఆ ప్రాంతమంతా చదును చేయడం జనమంతా చూశారు. కానీ, అధికారులకు ఏ మాత్రం పట్టలేదు. ఎమ్మెల్యేకు సంబంధించినదనో మరేంటో తెలియదు గాని అక్రమ తవ్వకాలు, తరలించిన వారిపై చర్యలు తీసుకోలేదు. స్థానికులు గట్టిగా ప్రశ్నించడం, ఫిర్యాదు చేయడంతో అక్రమ తవ్వకాలు జరిగిన సంచాం కొండ వద్దకు వెళ్లి ఆపారు. అనుమతుల్లేకుండా తవ్వకాలు జరపకూడదని అడ్డుకున్నారు. కానీ, తవ్విన గ్రావెల్‌ను తరలించిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించే ప్రయత్నం చేయలేదు. అసలు తవ్వకాలు జరిపిందెవరు? ఎమ్మెల్యే ఇంటి దగ్గరకు ఎన్ని లోడ్లు తరలించారు? అన్నదానిపై కనీసం ఆరా తీయలేదు.

బస్ షెల్టర్ కూల్చివేతపై చర్యలేవి?

గ్రావెల్ తరలింపునకు అడ్డంగా ఉందనో మరేంటో తెలియదు గానీ ఎన్నో ఎళ్ల నాటి సంచాం బస్ షెల్టర్‌ను గ్రావెల్ రవాణాలో భాగంగా కూల్చేశారు. చెప్పాలంటే బస్ షెల్టర్ ప్రభుత్వ ఆస్తి. దానికి నష్టం జరిగితే బాధ్యులైన వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలి. కానీ ఇంతవరకు కూల్చేసిన బస్ షెల్టర్‌ను పరిశీలించడానికి ఏ ఒక్క అధికారి వెళ్లకపోవడం గమనార్హం.

ఖరీఫ్‌కు సన్నద్ధత : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు, విత్తనాల పంపిణీని సన్నద్ధం చేసే అంశాలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ రెండు అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. సకాలంలో రైతులకు విత్తనాలు అందించాలని, సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. అనంతరం, కలెక్టర్ గ్రామ వార్డు సచివాలయాల పరిశుభ్రత, సచివాలయ ఉద్యోగుల పనితీరు, మత్స్య పశుసంవర్థక శాఖల పనితీరు, రహదారుల నిర్మాణం, భూవివాదాల పరిష్కారం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఆస్పత్రుల్లో ఔషధాల లభ్యత వంటి ఇతర ముఖ్యమైన అంశాలపై కూడా చర్చించారు. పారిశుద్ధ్య పనులను ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు ప్రారంభించాలని ఆయన ప్రత్యేకంగా సూచించారు. మత్స్యశాఖ చేపల పెంపకంపై, పశుసంవర్ధక శాఖ పశువుల వ్యాక్సినేషన్ కార్డుల పంపిణీపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఆదేశించారు. విద్య, వైద్య ఆరోగ్య శాఖల పనితీరును కూడా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పరిశుభ్రత, తాగునీరు టాయిలెట్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రుల్లో మందుల లభ్యత, వైద్యుల హాజరు వంటి విషయాలపై మండల స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ వనరుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, పనులు ఆలస్యం చేయవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఆయా మండలాల నుంచి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'ఆహార భద్రత నియమాలు పాటించాల్సిందే'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఆహార భద్రత నియమాలు పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ మంగళవారం తెలిపారు. ఆహార భద్రత నియమాలు పాటించని వ్యాపారులపై ఆయన కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం విచారణ చేసి రూ.1,20,000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఆహార పదార్థాల తయారీ, అమ్మకాలు చేసే వారు అక్రమాలకు పాల్పడిన వారిపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం-2006లోని నియమ, నిబంధనల ప్రకారం చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు : ఎస్పీ



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, అదనపు ఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైమ్ : ఇతరులను కించపరిచేలా సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సోషల్ మీడియా, సైబర్ కేసులు నమోదు, దర్యాప్తు, ముద్దాయిలు అరెస్టు, ఆర్థిక, సైబర్ నేరాల్లో పోగొట్టుకున్న నగదు ఫ్రీజ్ వంటి అంశాలపై అధికారులతో ఎస్పీ మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియా కేసుల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేశామని, అసత్య ప్రచారాలు మాధ్యమాల ద్వారా చేసేవారిని సైబర్ సెల్, సోషల్ మీడియా పోలీసు బృందాలు గుర్తించి కేసులు నమోదు చేస్తారన్నారు. ఫొటోలు, వీడియోల మార్ఫింగ్, ట్రోలింగ్ చేసినా, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులకు పాల్పడినా చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో బాధిత వ్యక్తులు పోగొట్టుకున్న నగదును గోల్డెన్ అవర్‌లో ఫ్రీజ్ చేయించి దర్యాప్తు అనంతరం కోర్టు ద్వారా సంబంధిత నగదును బాధితులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. టూల్స్, బేసిక్ నాలెడ్జ్‌తో పాటు హ్యూమన్ ఇంటెలిజెన్సుతో కేసులు చాకచక్యంగా ఛేదించాలన్నారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ కేవీ రమణ పాల్గొన్నారు.

బోర్డు కూల్చేశారు



వాడాడ కూడలి సమీపంలో ఆలయ భూమి బోర్డును కూల్చేసిన దృశ్యం

- అడ్డూ అదుపు లేకుండా ఆదిత్యుని భూముల ఆక్రమణ
- చోద్యం చూస్తున్న అధికారులు

అరసవల్లి: కూటమి ప్రభుత్వంలో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ భూములకు రక్షణ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆక్రమణదారులు పెరిగిపోయి ఆలయ భూములను ప్రైవేటు భూముల్లో కలిపేస్తున్నారు. స్థానిక రాజకీయ నేతల అండదండలతో దేవుని భూములను గుప్పిట్లో పెట్టుకుని క్రమేణా ఆక్రమించేందుకు స్కెచ్ వేసేశారు. ఇప్పటికే సర్వే నంబర్ 130లో ఏకంగా ప్రైవేటు లేఅవుట్‌కు రహదారినే నిర్మించేసిన 'రియల్' వ్యాపారులు గ్రామదేవత అసిరితల్లి అమ్మవారి ఆలయం ముందున ఉన్న ఆలయ భూముల్లో భారీ నిర్మాణం కోసం వాస్తు నెపంతో తొమ్మిది పిల్లర్లను నిర్మించేసి ఆక్రమించేశారు. ఇప్పుడు తాజాగా వాడాడ కూడలికి సమీపంలో సర్వే నంబర్ 130లో ఓ భాగమైన ఆలయ భూముల వివరాలను తెలియజేసే బోర్డును మట్టిలో తొక్కేశారు. దీంతో ఈ మిగిలిన భూములను కూడా ఇదే క్రమంలో ఆక్రమించేలా రియల్ వ్యాపారులు అడుగులు వేస్తున్నారు.

మట్టిలో ఆలయ భూముల బోర్డులు

ఆదిత్యుని ఆలయానికి అరసవల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో పలుచోట్ల విలువైన భూములున్నాయి. దాదాపుగా ఆలయ భూములను ఆలయ వంశపారంపర్య అర్చకుల స్వాధీనంలో సుమారు 50 ఎకరాల వరకు భూములున్నాయి. వీరికి జీతాలకు బదులుగా ఈ మేరకు భూములను ఇస్తూ దశాబ్దాల కిందటే దేవదాయ శాఖ ఉత్తర్వులను ఇచ్చింది. ఇవి కాకుండా మిగిలిన సుమారు 30 ఎకరాల వరకు ఆదిత్యుని భూములు వివిధ ప్రాంతాల్లో పంటభూములుగా ఉన్నాయి. అయితే అరసవల్లి, శ్రీకాకుళం నగరానికి సమీపంలో ఉన్న ఆలయ భూములపై రియల్ వ్యాపారులు, స్థానిక అధికార పార్టీ నేతల కన్ను పడడంతో ఎలాగైనా ఆ భూములను ఆక్రమించేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పలు చోట్ల భూముల్లో భాగాలను తమ భూముల్లో కలిపేసుకుంటుండగా, మరికొన్ని చోట్ల ఏకంగా ఆలయ భూముల్లో రహదారులను నిర్మించేసుకుని తమ రియల్ వ్యాపారాలకు మార్గం వేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆలయ భూముల వివరాలు తెలియజేసే బోర్డులను మాయం చేస్తున్నారు. ఆలయానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి, ఓ రెగ్యులర్ ఉద్యోగి కలిపి రియల్ వ్యాపారులతో లావాదేవీలను నెరపుతున్నారని సమాచారం. అడ్డుకోవాల్సిన ఆలయ ఉన్నతాధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు.




అంతన్నారు.. ఇంతన్నారు!

- ఎన్నికల వేళ అరచేతిలో వైకుంఠం చూపిన కూటమి నేతలు
- గద్దెనెక్కాక ఉద్యోగుల సమస్యలు గాలికొదిలేసిన సర్కారు
- ఐఆర్, పీఆర్‌సీ, పెండింగ్ డీఏల ఊసెత్తని ప్రభుత్వం



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)



శ్రీకాకుళం:

ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం దగా చేసింది. ఎన్నికల సందర్భంలో అనేక హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిన కూటమి నేతలు.. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఉద్యోగులు, పెన్షనర్లుకు ఐదో తేదీలోగా జీతాలు, పెన్షన్లు ఇవ్వడం మినహా మరేవిధమైనా ఆర్థిక ప్రయోజనం చేకూర్చలేదు. ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేసిన నిధుల్లో రూ.2300 కోట్లు వరకు సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంటుకే సరిపోయింది. మిగిలిన నిధుల్లో పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, పీఎల్ఎస్‌లు విడుదల చేయడం తప్ప ఐఆర్, పీఆర్‌సీల ఊసెత్తిన దాఖలాలు లేవు. ఉద్యోగ విరమణ చేసిన వారికి ఆర్థిక ప్రయోజనాలను కూడా మంజూరు చేయడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో సుమారు వెయ్యి మంది వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారు. వారిలో ఏ ఒక్కరికి ఆర్థిక ప్రయోజనాలు చెల్లించలేదు. వీరందరికీ గ్రాట్యుటీ, కమిటేషన్ ఆర్జిత ఈఎల్స్‌లు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. పదవీ విరమణ చేసిన ప్రతి ఉద్యోగికి రూ.20 లక్షలు నుంచి రూ.50 లక్షలు వరకు బకాయిలున్నాయి. ప్రభుత్వం ఏర్పడ్డాక మూడు డీఏలను మంజూరు చేయాల్సి ఉండగా వాటినీ గాలికొదిలేశారు. ఇలా ఏ ఒక్క ప్రయోజనాన్ని చేకూర్చకపోవడంతో మరోసారి చంద్రబాబు మాటలకు దగాపడ్డామని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలని సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

సీపీఎస్ సంగతేంటి..?

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకువస్తామని కూటమి నేతలు ఎన్నికల సందర్భంలో ప్రగల్భాలు పలికారు. వీటిని నమ్మిన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల్లో కూటమి విజయానికి తమ వంతు కృషి చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే గెలిచాక కూటమి నేతలు సీపీఎస్ ఉద్యోగుల ముఖమే చూడటం లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా ఓపీఎస్ అమలు చేయడం అసాధ్యమని, వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రవేశపెట్టిన సీపీఎస్ అమలుకు పరిశీలన చేస్తున్నామని చెప్పటం గమనార్హం. ఓపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పిన కొన్ని రాష్ట్రాలు కూడా అది సాధ్యం కాదని భావించి సీపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పడం విశేషం. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్నికల్లో కూటమి తరఫున కార్యకర్తల్లా పనిచేసిన సీపీఎస్ పోరాట కమిటీ నాయకులు, సభ్యులు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. కూటమి నేతలకంటే జగన్‌మోహన్‌రెడ్డి నయమన్న విషయాన్ని ఇప్పుడు గుర్తించినా చేతులు కాలాక ఆకులు పట్టుకొని ప్రయోజనం లేదన్న నిర్ణయానికొచ్చారు. మొత్తమ్మీద కూటమి ప్రభుత్వ తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లవర్గం తీవ్ర అసంతృప్తి వెల్లగక్కుతోంది.

డీఏలు ఎక్కడ?



కూటమి నేతలు పాత బకాయిలను తీర్చేస్తామని ఆర్థిక ప్రయోజనాలను ఎప్పటికప్పుడు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారు. వాటిని నమ్మి మోసపోయాం. పాతవి ఇవ్వకపోగా మూడు డీఏలు పెండింగ్‌లో పెట్టారు. పీఆర్‌సీ, ఐఆర్ ఊసే లేదు.

– గరుగుబిల్లి రమణ, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

త్వరలోనే ఆందోళన బాట



ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించాం. ఇప్పటికే విడతల వారీగా ఆందోళన చేపట్టాం. త్వరలోనే ప్రత్యక్ష ఆందోళనకు దిగాలని నిర్ణయించాం.

– గొంటి గిరిధర్, యూటీఎఫ్ నాయకుడు

క్లుప్తంగా

తవ్వకాలపై ప్రశ్నించినందుకు కేసులా?

గార: మండల కేంద్రం గార సమీపంలో ఇసుక ర్యాంపు వద్ద అక్రమ తవ్వకాలపై నిలదీసినందుకు కేసులు పెట్టేందుకు ర్యాంపు నిర్వాహకులు వెనుకాడటం లేదు. స్థానిక మాజీ ఎంపీటీసీ జల్లు రాజీవ్ సోమవారం రాత్రి ఇసుక స్టాకు పాయింటు వద్ద సిబ్బందిని నిలదీశారు. ఇష్టానుసారంగా పెద్ద గోతులు పెట్టి రాత్రి వేళల్లో కూడా పట్టుకెళ్లి పర్యావరణాన్ని నాశనం చేయడంపై ప్రశ్నించారు. ఉదయం పూట మాత్రమే ఇసుక లోడింగ్ చేయాలని నిబంధనలు పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 పంచాయతీలకు సాగునీరు, వందలాది బోర్లు ఉప్పు నీరు రావడం వంటివి జరిగి ఇబ్బందులు పడుతున్నామని నిలదీశారు. అనంతరం రెండు ట్రిప్పర్లను తీసుకెళ్లి గార పోలీసులకు అప్పగించారు. రాజీవ్‌తో పాటు మరి కొందరు వైఎస్సార్ సీపీ నాయకులు వెళ్లి ర్యాంపు నిలిపేయాలని పోలీసులకు విన్నవించారు. ర్యాంపు నిలిపేయాలని కలెక్టర్‌కు సైతం వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో గారకు చెందిన ఐదుగురు వ్యక్తులు బెదిరిస్తున్నారని ర్యాంపు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తూరు: హిరమండలం మండలం శుభలాయి గ్రామానికి చెందిన అవివాహితుడు పిన్నింటి నగేష్(22) మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగేష్ చెడు వ్యసనాలకు బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన కొత్తూరు వచ్చేసి బీసీ బాలుర వసతి గృహం సమీపంలో టేకు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న సీఐ సీహెచ్ ప్రసాదరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు పిన్నింటి జోగారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ఎండీ యాసిన్ తెలిపారు.

ఐదుగురు జేఎల్స్‌కు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా నుంచి ప్రిన్సిపాళ్లుగా ఐదుగురు జూనియర్ లెక్చరర్లకు పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా ప్రొసీడింగ్స్ వెలువరించారు. వీరంతా ఏపీపీఎస్సీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా జేఎల్స్‌గా నియామకమైనవారు కావడం విశేషం. ప్రిన్సిపాళ్లగా పదోన్నతి పొందనున్న వారిలో టి.జగదీశ్వరరావు (జీజేసీ శ్రీకాకుళం బాలురు- బోటనీ), పి.శైలజ (జీజేసీ శ్రీకాకుళం బాలికలు- హిస్టరీ), జి.ధనుంజయరావు (జీజేసీ ఆమదాలవలస- బోటనీ), ఎ.అప్పన్న (జీజేసీ నరసన్నపేట- బోటనీ), జి.తిరుపతిరావు (జీజేసీ ఆమదాలవలస- సివిక్స్) ఉన్నారు. త్వరలో వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి జోన్-1 (పునర్విభజనకు పూర్వపు ఉత్తరాంధ్ర జిల్లాలు) పరిధిలో ప్రిన్సిపాళ్లుగా నియమించనున్నారు.

రాజకీయ కక్షతోనే సర్పంచ్ చెక్ పవర్ రద్దు


కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు

ఎచ్చెర్ల క్యాంపస్ : వైఎస్సార్ సీపీకి చెందిన బొంతలకోడూరు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు చెక్ పవర్ రాజకీయ కక్షతో తొలగించారని, సమగ్ర విచారణ నిర్వహించి చెక్ పవర్ పునరుద్ధరించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎచ్చెర్ల సమన్వయకర్త గొర్లె కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ సచివాలయం భవనం హైకోర్టు తీర్పుకు లోబడి పాఠశాల ప్రాంగణంలో పనులు నిలిపివేశారని, ఇంజినీరింగ్ అధికారులు ఎంబుక్ రికార్డు మేరకు పంచాయతీ నిధులు రూ.1.80 లక్షలు చెల్లించినట్లు చెప్పారు. పంచాయతీ నిధులను వ్యక్తిగత దుర్వినియోగం, నిబంధనలకు వ్యతిరేకంగా ఖర్చు చేయలేదని వివరించారు. కూటమి నాయకులు, అధికారులు కుమ్మక్కై చెక్ పవర్ రద్దు చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక సంస్థల నిబంధనలు, 73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధంగా చెక్ పవర్ రద్దు చేయడం తగదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ డీపీవో ఉత్తర్వులను, నివేదిక అధ్యయనం చేసి థర్డ్ పార్టీ అధికారితో దర్యాప్తు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమాలను అడ్డుకుంటున్నానన్న కక్షతో చెక్ పవర్ రద్దు చేశారని, విచారణ నిర్వహించి న్యాయం చేయాలన్నారు. అక్రమాలు నిరూపిస్తే స్వచ్ఛందంగా సర్పంచ్ బాధ్యతలు నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షులు నేతింటి నీలం, మాజీ సర్పంచ్ నక్క కృష్ణమూర్తి, బొంతలకోడూరు ఎంపీటీసీ మాడుగుల జగదీశ్వరరావు పాల్గొన్నారు.

కిశోరీ బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ


మాట్లాడుతున్న ఆర్‌జేడీ చిన్మయి దేవి

కొత్తూరు: కిశోరీ బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయి దేవి అన్నారు. కొత్తూరు-4, కల్లెమ్మ ఆర్‌ఆర్ కాలనీలోని చిన్నసంకిలి అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరీ వికాస్ తరగతలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనతకు గురికాకుండా బాలికలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా పీడీ కనకదుర్గ, కొత్తూరు, సీతంపేట సీడీపీవోలు విమలకుమారి, రంగల్మో, సూపర్‌వైజర్లు శాంతకుమారి, సుధావాణి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరుడు అరెస్టు

సోంపేట: సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగిలించిన ఒడిశాకు చెందిన యువకుడు అమిత్‌కుమార్ పాత్రోను సోంపేట పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో సోంపేట నెక్స్‌లెవల్ బైక్ గ్యారెజీ వద్ద అమిత్ కుమార్‌ను విచారించగా ఏడు ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు అంగీకరించాడు. వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సోంపేట ఎస్ఐ బి.లోవరాజు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందిని సీఐ బి.మంగరాజు అభినందించారు.

వ్యాన్ ఢీకొని యువకుడు మృతి


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

జి.సిగడాం: మండలంలోని ఉల్లివలస సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం పూతికవలస గ్రామానికి చెందిన గురాన అప్పలనాయుడు (37) మృతిచెందాడు. అప్పలనాయుడు చీపురుపల్లి నుంచి పూతికవలస వెళ్తున్న సమయంలో రాజాం మండలం కోతారిపురం నుంచి వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

సీపీఎం నేతలపై కేసు కొట్టివేత

కొత్తూరు: హిరమండలం వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల హక్కుల కోసం పోరాటాలు చేసిన సీపీఎం నాయకులపై 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ పాలనలో హిరమండలం పోలీసులు పెట్టిన కేసును మంగళవారం కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొట్టివేసినట్లు ఆ పార్టీ జిల్లా నాయకుడు గంగరాపు సింహాచలం తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం, డీఎస్పీ దాడి చేసినట్లు కేసు పెట్టారని, ఆధారాలు లేకపోవడంతో కేసు కొట్టివేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, సీపీఎం సీనియర్ నాయకులు బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం, నారాయణరావు ఉండగా.. సీనియర్ న్యాయవాది ఎం.అప్పారావు వాదించారు.

వడ్డీలు కట్టలేకపోతున్నా..


సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న తిరుపతిరావు

శ్రీకాకుళం క్రైమ్ : 'రోజూ రూ.లక్షల్లో వడ్డీలు కట్టలేకపోతున్నా.. వేధింపులు భరించలేకపోతున్నా.. చచ్చిపోతానో.. బతుకుతానో.. నాకే తెలియదు' అంటూ ఓ వ్యక్తి తన భార్యకు జాగ్రత్తలు చెబుతూ విడుదల చేసిన సెల్ఫీ వీడియో జిల్లా కేంద్రంలో మంగళవారం హల్‌చల్ చేసింది. ఆటోలో వెళ్తూ శనివారం ఈ సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇతను జలుమూరు మండలం బొడ్డపాడుకు చెందిన అంపోలు తిరుపతిరావుగా గుర్తించారు. పదేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఉండేవారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఈయన భార్య భాను సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తిరుపతిరావు కొంతకాలంగా భార్యతో కలసి శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నట్లు తెలిసింది. కాగా, రమణమూర్తి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. ఇదే విషయమై శ్రీకాకుళం పట్టణ, రూరల్ సీఐలు పి.ఈశ్వరరావు, సీహెచ్ పైడపునాయుడుల వద్ద ప్రస్తావించగా తమకు ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

కుమారుడి కళ్లెదుటే తండ్రి దుర్మరణం


మృతి చెందిన సింహాచలం

టెక్కలి: కోటబొమ్మాళి మండలం జర్జంగి సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా, కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్తున్న జాతీయ రహదారిలో చిప్స్‌లోడుతో వస్తున్న ట్రాక్టర్ శ్రీజగన్నాథపురం వెళ్లేందుకు జర్జంగి జంక్షన్ వద్ద ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా యూటర్న్ తీసుకుంది. అదే రహదారిలో ద్విచక్రవాహనంపై వస్తున్న జలుమూరు మండలం బాచివలస గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు బొడ్డల సింహాచలం (35), జగన్మోహనరావులు ట్రాక్టర్‌ను బలంగా ఢీట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తండ్రీ కొడుకులను 108 సహాయంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సింహాచలం మృతి చెందగా, కుమారుడు జగన్మోహనరావు చికిత్స పొందుతున్నాడు. స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్గో ఎయిర్‌పోర్టుతో విధ్వంసం


గేయాలు ఆలపిస్తున్న ప్రజా కళాకారులు

మందస: పచ్చని ఉద్యానంలో కార్గో ఎయిర్‌పోర్టుతో విధ్వంసం సృష్టించవద్దని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మందస మండలం రాంపురం, గంగువాడ గ్రామాల్లో మంగళవారం కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు పిలుపుమేరకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు, ప్రజా కళామండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవి, రంగం కళాకారులు కోనారి సూదన్ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ప్రజామోదానికి విరుద్ధంగా పాలకులు వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చపర వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, ఉప కార్యదర్శి వంకల మాధవరావు, వై.యస్.ఆర్.ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్, లోకనాథం, రైతాంగ జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన బాబు


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

వజ్రపుకొత్తూరు రూరల్: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా రైతులకు పంగనామాలు పెట్టారని ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య దుయ్యబట్టారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే మిన్నగా పెద్ద ఎత్తున రైతు భరోసా అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి దాదాపుగా ఏడాది కావస్తున్నా అమలు చేయలేదని మండిపడ్డారు. మిర్చి, పొగాకు, ధాన్యం తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడం లేదన్నారు. సంక్షోభాలను నియంత్రించాలంటే పోరాటాలే శరణ్యమన్నారు. ఆయనతో పాటు ప్రజా సంఘ నాయకులు ఎస్.మోహన్, జి.సుగుణ ఉన్నారు.

ఇంకెన్నాళ్లు!



ఫ్లై ఓవర్ పక్కన గోతులమయంగా మారిన రోడ్డు, (ఇన్‌సెట్లో) అసంపూర్తిగా ఉన్న ఫ్లై ఓవర్ నిర్మాణం

- మూడేళ్లుగా పూర్తికాని ఫ్లై ఓవర్ నిర్మాణం
- గోతులమయంగా పక్కనే నిర్మించిన రోడ్డు
- చినుకుపడితే నరకయాతన
- 15 కి.మీ. అదనపు ప్రయాణం

సారవకోట/జలుమూరు: జలుమూరు మండలంలోని తిలారు రైల్వేగేటుపై జాతీయ రహదారి 326-ఏ మీద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ నిర్మాణం నత్తనడకన నడుస్తోంది. 2019 సంవత్సరంలో నరసన్నపేట మండలం జమ్ము జంక్షన్ నుంచి పాతపట్నం వరకు రోడ్డు నిర్మాణ పనులు సుమారు రూ.650 కోట్లతో ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు 70 శాతం పూర్తయిన తర్వాత మూడేళ్ల క్రితం తిలారు రైల్వేగేటుపై ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పూర్తికాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టే సమయంలో పనులు జరుగుతున్న ప్రదేశానికి ఇరువైపులా వాహనాల రాకపోకలకు సరైన రోడ్డు మార్గం వేయాల్సి ఉన్నా, సంబంధిత కాంట్రాక్టర్ తూతూమంత్రంగా రోడ్డు నిర్మాణం చేపట్టి చేతులు దులుపుకున్నాడు. దీంతో మూడేళ్లుగా చిన్నపాటి వర్షంపడినా గోతుల్లో నీరు నిల్వ ఉండిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గోతులు బకారణంగా రాత్రిపూట ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నా సంబంధిత కాంట్రాక్టర్ గానీ, జాతీయ రహదారుల అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

తప్పని అదనపు చార్జీలు

ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా వన్ వే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో పాతపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు చల్లవానిపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి మండలం జర్జంగి మీదుగా వెళ్లి, అక్కడి నుంచి జాతీయ రహదారి 16లో హరిశ్చంద్రాపురం జంక్షన్, నిమ్మాడ మీదుగా నరసన్నపేట వెళ్తున్నాయి. దీంతో పాతపట్నం, సారవకోట, జలుమూరు మండలాల నుంచి నరసన్నపేట బస్సుల్లో వెళ్లే ప్రయాణికులపై అదనంగా రూ.20 చార్జీలు పడుతున్నాయి. ప్రతి నిత్యం సారవకోట, జలుమూరు మండలాల నుంచి నరసన్నపేట వెళ్లే వందలాదిమంది ప్రయాణి కులపై ఈ చార్జీలు అదనంగా పడడంతో పాటు సుమారు అరగంట పాటు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ మండలాల నుంచి నరసన్నపేటలోని పలు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇదివరకు బయల్దేరే సమయం కంటే మరో అరగంట ముందు బయల్దేరాల్సి వస్తోందని అంటున్నారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర శక్తి పెరిగినా ఈ ఫ్లై ఓవర్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణితో ఏళ్ల తరబడి పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణికులు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లై ఓవర్‌కు పక్కనున్న రోడ్డు గోతులమయంగా ఉండడంతో వాహనాలు త్వరగా చెడిపోతున్నాయని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు.

వ్యయ, ప్రయాసలు పెరుగుతున్నాయి



సారవకోట మండలం నుంచి నరసన్నపేట బస్సులో వెళ్లాలంటే రూ.20 అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. చుట్టూ తిరిగి వెళ్లడంతో అరగంట సమయ అదనంగా పడుతోంది. దీంతో సమయానికి చేరలేకపోతున్నాం. ఒక్క నెల మాత్రమే వన్ వే ఉంటుందని అప్పట్లో అన్నారు. కానీ నాలుగు నెలలు పూర్తయినా వన్ వేలో ప్రయాణిస్తుండడంతో వ్యయ, ప్రయాసలు పెరుగుతున్నాయి.

– కల్యాణం శ్రీనివాసరావు, అలుదు, సారవకోట మండలం

పనులు పూర్తి చేస్తాం

ఇప్పటికే చాలావరకు పనులు పూర్తి చేయించాం. త్వరలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పూర్తి చేసి వాహనాల రాకపోకలకు అవకాశం కల్పిస్తాం. ఫ్లై ఓవర్ పక్కన నిర్మించిన రోడ్డు గోతులుగా ఉందనే విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– కె.సత్యభాస్కర్, డీఈఈ, జాతీయ రహదారులు, విశాఖపట్నం